



పల్లెల్లో.. ప్రగతి బాట!

- నేటి నుంచి 'పల్లె పండగ' ప్రారంభం
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు సన్నాహాలు
- రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు



● రణస్థలం మండలం జే.ఆర్.పురం పంచాయతీలో పారిశుధ్యం దుస్థితి ఇది. ఇక్కడ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు అంతంత మాత్రమే. చేపల మార్కెట్ నుంచి వ్యర్థాలు రోడ్డుపైనే పడేస్తున్నారు. దీంతో వాడుక నీరు ఇలా రహదారులపై ప్రవహిస్తోంది. గత ఐదేళ్లుగా ఇదే సమస్య ఉన్నా.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రజల బాధలు వర్ణనాతీతం.



● పైడిభీమవరంలో కాలువల దుస్థితి ఇది. గత పంచాయతీ ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ సానుభూతిపరుడు సర్పంచ్‌గా గెలిచారు. దీంతో అభివృద్ధి పనుల మంజూరులో తీవ్ర వివక్ష కొనసాగింది. ప్రత్యేకంగా పంచాయతీ అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వ చర్యలు పంచాయతీ ప్రజలకు శాపంగా మారాయి.



● మందస మండలం మకరజోల పంచాయతీ అల్లిమెరక గ్రామానికి అంతర్గత రహదారి ఇది. రాళ్లతేలి, ఇసుక మేటలతో రహదారి అధ్వానంగా తయారైంది. గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారికి.. ప్రస్తుతం పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపులు ఇలా..

నియోజకవర్గం	పనుల సంఖ్య	నిధులు (కోట్లలో)
శ్రీకాకుళం	444	32.54
ఆమదాలవలస	386	39.99
ఎచ్చెర్ల	375	20.93
నరసన్నపేట	86	24.10
టెక్కలి	830	65.39
ఇచ్ఛాపురం	624	29.42
పలాస	303	27.52
పాతపట్నం	423	21.93
	3,471	261.82

● మందస మండలం భోగాపురం పంచాయతీ జగన్నాథపురం గ్రామం దుస్థితిది. గ్రామంలో సీసీ రోడ్లు లేక, కాలువల నిర్మాణానికి నోచుకోక చిన్నపాటి వర్షానికి ఇలా గ్రామం మధ్య నుంచి నీరు ప్రవహిస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇలాంటి గ్రామాలకు మోక్షం లభించనుంది.



(రణస్థలం/ హరిపురం)

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు పడకేశాయి. ప్రధానంగా రహదారులు అడుగుకో గుంత... గజానికో గొయ్యితో అధ్వానంగా తయారయ్యాయి. కాలువలు కూడా ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి దుర్గంధ భరితంగా మారాయి. వలంటీర్లను అందలమెక్కించిన జగన్ సర్కారు.. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్న విమర్శలు ఉన్నాయి. పంచాయతీలకు చెందాల్సిన ఆర్థిక సంఘం నిధులను సైతం పక్కదారి పట్టించడంతో సర్పంచ్‌లు నిస్సహాయులుగా మారిపోయారు. కనీసస్థాయిలో సమస్యలు పరిష్కరించలేక.. ప్రజలకు ముఖం చూపించలేక లోలోపల మదనపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పల్లె ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రహదారుల మరమ్మతులకు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. గ్రామసభల ద్వారా పనులను గుర్తించి.. నిధులు మంజూరు చేసింది.

● జిల్లాలో 912 పంచాయతీల్లోనూ ఆగస్టు 22న గ్రామసభలను నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే, మండలస్థాయి నాయకులు, గ్రామపెద్దలు, ప్రజలందర్నీ భాగస్వామ్యం చేశారు. ప్రాధాన్యతా పరంగా ప్రజోపయోగ పనులు గుర్తించారు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కూటమి ప్రభుత్వం ఆ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో రూ.261.82 కోట్ల నిధులతో 3,471 పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకుగానూ పనుల ప్రతిపాదికన ఉపాధిహామీ పథకం నిధులు కేటాయించింది. 'పల్లె పండగ' పేరిట ఈ నెల 14 నుంచి 20లోగా శంకుస్థాపనలు పూర్తిచేయాలని ఆదేశించింది. సంక్రాంతిలోగా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేసింది.

పంచాయతీలకు కొత్త రూపు..

వైసీపీ పాలనలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులను గ్రామసచివాలయ భవనాలు, హెల్త్‌క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలు, బల్క్‌మిల్క్ సెంటర్‌ల నిర్మాణానికి మళ్లించారు. దీంతో పల్లెల్లో మిగతా సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు కష్టాలపాలయ్యారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పల్లెల్లో 70శాతం మేర సీసీ రోడ్లు నిర్మించారు. ఆయా చోట్ల మిగిలిన అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దిశగా ప్రతిపాదనలు పూర్తయి గ్రౌండ్ లెవల్‌లో నిర్మాణాలకు యంత్రాంగం నిమగ్నమైంది. ఈ నెల 14 నుంచి పనులు ప్రారంభించనుండడంతో ఆయా పంచాయతీలకు మహర్దశ కలగనుంది.

ఐదేళ్లుగా అవమానం..



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెలకు ఒరిగిందేమీలేదు. పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. వారికి తెలియకుండానే ఆర్థిక సంఘం నిధులను మళ్లించింది. దారుణంగా అవమానించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పల్లెపాలనపై దృష్టి పెట్టి.. మమ్మల్ని మళ్లీ తలెత్తుకునేలా చేసింది.

-సింకు భవానీ, సర్పంచ్, పైడిభీమవరం

శుభ పరిణామం..



వైసీపీ హయాంలో ఎందుకు సర్పంచ్‌లు అయ్యామా అని బాధపడేవారం. ఏదైనా సమస్యను ప్రజలు చెబితే వారికి ఏం చెప్పి సముదాయించాలో తెలిసేది కాదు. పనులు జరగకపోవడంతో ప్రజలు కూడా పెద్దగా విలువ ఇచ్చేవారు కాదు. కనీసం వలంటీరుకు ఉండే గౌరవం కూడా మాకు లేకుండా పోయేది. చాలా బాధ వేసేది. కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టడం శుభ పరిణామం.

-నడుకుదిటి రజనీ ఈశ్వరరావు, సర్పంచ్, బంటుపల్లి

ఇబ్బందులు పడ్డారు..



గత ఐదేళ్ల గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కనీసం రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో పల్లెలు దిక్కులేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు హర్షాతిరేకాలు తెలియజేస్తున్నారు.

-బి.దామోదరం, మాజీ సర్పంచ్, నారాయణపురం

గడువులోగా పూర్తిచేస్తాం..

ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రజలతో గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించాం. ఉన్నతాధికారుల ఆమోదంతో పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గడువులోగా పనులు పూర్తయ్యేలా కృషిచేస్తాం.

-జి.రవికుమార్, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ, పలాస

కిక్.. లక్.. ఎవరిదో?

- నేడు కొత్త వైన్‌షాపుల కోసం డ్రా
- 158 దుకాణాలకు 4,671 దరఖాస్తులు
- శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీకి ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో 158 ప్రైవేటు మద్యం దుకాణాల కోసం సోమవారం లాటరీ తీయనున్నారు. ఈ నెల 1 నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. మొత్తం 4,671 వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ ఫండ్‌ను అభ్యర్థులు జమచేయగా.. ప్రభుత్వానికి రూ.93.42కోట్ల ఆదాయం సమకూరింది. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. ఈ దరఖాస్తులను డ్రా తీసి అభ్యర్థులకు షాపులకు కేటాయించనున్నారు. డ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. 'సోమవారం ఉదయం ఏడు గంటలకే ఆడిటోరియం ప్రాంగణానికి ధ్రువపత్రాలు, ఎంట్రీపాస్‌లతో అభ్యర్థులు చేరుకోవాలి. వాహనాల పార్కింగ్‌కు కేఆర్ స్టేడియం మైదానాన్ని కేటాయించాం. లాటరీ ప్రక్రియ తర్వాత ప్రభుత్వం నిర్దేశించిన లైసెన్సు ఫీజును అభ్యర్థులు చెల్లించాలి. ఈ నెల 16 నుంచి కొత్త షాపులు ఏర్పాటు కానున్నాయి' అని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ప్రాంతం	దుకాణాలు	దరఖాస్తులు
శ్రీకాకుళం	32	1,065
రణస్థలం	15	662
ఆమదాలవలస	13	367
కోటబొమ్మాళి	15	364
పొందూరు	10	353
సోంపేట	12	316
టెక్కలి	11	301
నరసన్నపేట	12	292
ఇచ్ఛాపురం	8	268
పలాస	15	239
పాతపట్నం	8	239
కొత్తూరు	7	205
మొత్తం	158	4,671

● గుడ్‌విల్ పేరిట షాపుల విక్రయాలు..

అన్ని వ్యాపారాలకంటే లాభదాయకంగా ఉండడంతో.. మద్యం దుకాణాలపై ప్రముఖుల నుంచి చిన్నపాటి వ్యాపారులు సైతం కన్నేశారు. దుకాణం కావాలంటే కేవలం దరఖాస్తు వేస్తే సరిపోదు. అంతా లాటరీ ప్రక్రియ కావడంతో.. ఎవరికి అదృష్టం వరిస్తుందో చెప్పలేం. దీంతో చాలామంది దరఖాస్తుదారులు.. డ్రాలో దక్కించుకుని... ఆ షాపుని గుడ్‌విల్ పేరిట విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అదేరీతిన మండలాల వారీగా ముగ్గురు, నలుగురు వ్యాపారులు సిండికేట్ అయి.. నేడు డ్రాలో దుకాణం దక్కించుకున్నవారిని స్పాట్‌లోనే గుడ్‌విల్ పేరిట కొన్ని రూ.లక్షలకు కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. శ్రీకాకుళం వంటి పెద్దసెంటర్లతో సహా.. చిన్నచిన్న మండలాల్లో దుకాణాలను దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

నీలావతిలో ఎలుగుల సంచారం



పలాస రూరల్, అక్టోబరు 13: పలాస మండలం నీలావతి గ్రామంలో ఆదివారం సాయంత్రం మూడు ఎలుగుబంట్లు సంచరించడంతో జీడి రైతులు ఆందోళన చెందారు. ఇటీవల ఎలుగుల సంచారం తగ్గిందని, కాగా.. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడం, నీటివనరులు లేక మళ్లీ అవి గ్రామాల్లోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. జీడితోటల్లో తల్లీ, రెండు పిల్ల ఎలుగులు కనిపించాయని, అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని భయాందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



ఆక్రమించిన ట్రస్టు భూమిలో నందల తయారీ..

శాలిహుండాం ట్రస్టు భూమి ఆక్రమణ

పొందూరు, అక్టోబరు 13: పొందూరులో విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. రాపాక కూడలి నుంచి పొందూరు అంబేడ్కర్ కూడలి వరకు రోడ్డు పక్క ఉన్న భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ఈ భూములపై అక్రమార్కుల కన్ను పడి ఆక్రమించేస్తున్నారు. పొందూరులోని అంబేడ్కర్ కూడలి సమీపంలో రోడ్డుకు ఆనుకుని సర్వేనెంబర్ 198లో శాలిహుండాం వేణుగోపాలస్వామి ఆలయం ట్రస్టుకు 1.47ఎకరాల విలువైన భూమి ఉంది. పొందూరుకు చెందిన ఒక వ్యక్తి ఈ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి.. ఇటీవల నందల వ్యాపారం మొదలు పెట్టాడు. కాగా.. తన అనుమతి లేకుండా ఆక్రమించి నందల వ్యాపారం చేస్తున్నాడని, ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని ఆలయ ట్రస్టు యజమాని మధు రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలాన్ని కొంతమందికి లీజుకు ఇవ్వగా.. వారిపై ఇంకొంతమంది దౌర్జన్యం చేసి ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తప్పుడు ధ్రువపత్రాలతో భూమిని చేజిక్కించుకునేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, అక్రమార్కులకు కోర్టు ద్వారా నోటీసులు అందజేస్తామన్నారు.

చేప పిల్లల పంపిణీ ఎప్పుడో?

● స్వదేశీ మత్స్యకారుల ఎదురుచూపు

(టెక్కలి)

చేప పిల్లల కోసం స్వదేశీ మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. అక్టోబరు రెండో వారం అవుతున్నా ఇంతవరకు వారికి అందించలేదు. టెండర్ ప్రక్రియ ఇంకా కొలిక్కిరాకపోవడంతో అసలు చేప పిల్లలను పంపిణీ చేస్తారో? లేదో తెలియని పరిస్థితి నెలకొంది. మంత్రి అచ్చెన్నాయుడు ఇలాకాలో మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో టెక్కలి, సంతబొమ్మాళి, ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, కవిటి, సారవకోట, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, బూర్జ, ఆమదాలవలస, గార తదితర మండలాల్లో సుమారు 20వేల స్వదేశీ మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. చేపల పెంపకంపై వీరంతా ఆధారపడి బతుకుతున్నారు. వీరికి ఏటా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద అధికారులు చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉంది. గత ఏడాది ఒక చేపపిల్లను రూ.1.80 చొప్పున కొనుగోలు చేసి 40శాతం సబ్సిడీపై మత్స్యకారులకు పంపిణీ చేశారు. శ్రీకాకుళంలోని చేప పిల్లల ప్రొడక్షన్ యూనిట్, ఇచ్ఛాపురంలోని రేరింగ్ హేచరీ నుంచి కొంతవరకు సరఫరా చేశారు. జిల్లాలో సుమారు 180వరకు ట్యాంకులు ఉండగా వందకుపైగా ట్యాంకులకు అధికారులు కట్ల, రాహు, మృగాల రకాల పిల్లలను అందించారు. ఇవి చాలకపోవడంతో మత్స్యకారులు సొంతంగా ఏలూరు, కైకలూరు, భీమవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, బెంగాళ్, ఒడిశా ప్రాంతాల్లో చేప పిల్లలను కొనుగోలు చేసి మిగిలిన చెరువుల్లో పెంచారు. కానీ, ఈ ఏడాది ఇంతవరకు అధికారులు చేప పిల్లలను అందించలేదు. దీంతో స్వదేశీ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి చేపపిల్లలను పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా.. 'ఈ ఏడాది వర్షాలు తక్కువ కారణంగా ఆగస్టు రెండో వారంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమైంది. ఫింగర్ లింగ్స్ స్థాయి (75 రోజులు)కి వచ్చిన తరువాత వాటిని 40 శాతం వరకు మా పరిధిలో ఉన్న చెరువులకు అందజేస్తాం. ఇప్పటికే ఈ విషయాన్ని కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. మత్స్యకారులు 60 శాతం చేప పిల్లలను చెరువుల్లో వేశారు' అని తెలిపారు.



చిరు చేపపిల్లలు



నీటిలో విడిచిపెడుతున్న చేపపిల్లలు

దసరా సందడి



'సాయుధం'లో ఆయుధ పూజ

ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కార్యాలయంలో విజయదశమి సందర్భంగా శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆయుధ, వాహన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో చెడుపై మంచి యొక్క విజయానికి నాందిగా ప్రజలందరూ సంతోషంగా నిర్వహించే పండగ విజయదశమి అని ఎస్పీ తెలిపారు. జీవితంలో సన్మార్గంలో నడిచేందుకు అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ లభించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజశేఖర్, ఎల్.శేషాద్రి, సీఐలు ఇమ్మాన్యుయేల్‌రాజు, ఆర్ఐ నర్సింగరావు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల

బారులుదీరారు

● మద్యం, చికెన్, మటన్ షాపుల వద్ద రద్దీ

శ్రీకాకుళం అర్బన్/ అరసవల్లి, అక్టోబరు 13: ఈ ఏడాది విజయదశమి శనివారం కావడంతో... జిల్లాలో దసరా సందడి అంతా... ఆదివారం ఎక్కువ కనిపించింది. శనివారం ఆలయాలు, మండపాల్లో భక్తులు పూజలు చేశారు. ఆదివారం ఉదయానికే.. జిల్లా కేంద్రంతోపాటు నరసన్నపేట, టెక్కలి, పలాస-కాశీబుగ్గ, సోంపేట, ఆమదాలవలస, పాతపట్నం, కోటబొమ్మాళి, రణస్థలం, ఇచ్ఛాపురం తదితర పట్టణాల్లో మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు దీరారు. ఆదివారం ఒక్కరోజే జిల్లాలో రూ.2కోట్ల మేర మద్యం విక్రయాలు సాగాయి. అలాగే చికెన్, మటన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపించింది. ఓవైపు దసరాతోపాటు.. మరోవైపు శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి తదితర ప్రాంతాల్లో గ్రామదేవత వారాలు కూడా చేసుకోవడంతో మటన్, చికెన్ కోసం ఎగబడ్డారు.





శ్రీకాకుళంలో మద్యం దుకాణం, చికెన్ సెంటర్ వద్ద రద్దీ

దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్పియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టూ2(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సులో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.



శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్పేయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్పియర్ అంటారు. దీనిని అశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు. భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.

- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉత్పత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటిసారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, ÷)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (△, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్నీ ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 6 బి) 4 సి) 5 డి) 3

సమాధానం: (సి)


వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే

మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు

నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 4 బి) 2 సి) 1 డి) 5


సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు

మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు

రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు

నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S ఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు



దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్ధరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాలపాలయ్యారు. మరి కొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్ధరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికేర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీపడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవమూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికేర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గినబుదిహాల్ గ్రామానికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.



హరీష్, మల్లికార్జున రవి కుమార్

తిరుమలలో వైభవంగా చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో



చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్క్రీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్లైండ్ మన్' అనే ఎక్స్ పేజ్‌లో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చారు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

ఆధునికీకరణ కాక.. ఆయకట్టుకు నీరందక



తుడ్డలి వద్ద నిరుపయోగంగా ఉన్న కల్వర్టు

● ఇదీ తోటపల్లి పాత ఆయకట్టు కాలువల పరిస్థితి

బూర్జ: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు పూర్తికాకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. దీనికితో కాలువలు ఆక్రమణలకు తోడు లైనింగ్ పనులు కాక పోవడంతో శివారు ఆయకట్టు రైతులకు అగచాట్లు తప్పడం లేదు. దీనికితోడు పనులు పూర్తిచేసే గడువును ఏటా పెంచుకు పోతుండడంతో ఆధునికీకరణపై నీలినీడలు అలము కుంటున్నాయి.

ఇదీ పరిస్థితి..

బూర్జ మండలంలోని తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో 2018లో ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. బూర్జ మండలంలోని పాలవలస వరకు 65 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రూ.193 కోట్లు అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటివరకు ఎడమ కాలువలో 37.536 కిలోమీటర్ల కు 17.532 కిలోమీటర్లు మాత్రమే పూర్తయింది. కుడి కాలవకు 17.616 కిలోమీటర్లకు 9.372 కిలోమీటర్లు పనులు జరిగాయి. ప్రధాన కాలువలో కాంక్రీట్ లైనింగ్ జరగాల్సి ఉంది. 19 బ్రాంచి కాలువలో పరిధిలో బూర్జ మండలానికి చెందిన కాలువలో కనీసం పనులు జరగలేదు. పాలకొండ మండలంలోని వెలగవాడ నుంచి బూర్జ మండలంలోని పాలవలస వరకు ఏడు కిలోమీటర్ల పొడవునా సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరందించే కాలువ ఆక్రమణకు గురికావడంతోపాటు పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. వీటి మరమ్మతులకు నాలుగు కోట్లు అంచనా వ్యయం వేసినా పైసా కూడా ఖర్చు చేయలేదు. ప్రధానంగా కాలువ లైనింగ్ ఆక్రమణకు గురికావడంతో వర్షాల సమయంలో ఎక్కడికక్కడ గండ్లుపడుతున్నాయి. ఇప్పటికైనా తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణపనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో నీరందించాలని రైతులు కోరుతున్నారు.

పూర్తికాక.. వినియోగంలోకి రాక

● ఇదీ ఇసుకపాలెం పంచాయతీలోని అంగన్‌వాడీ భవనాలు, శ్మశాన వాటికల దుస్థితి

సరుబుజ్జిలి: మండలంలోని ఇసుకపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బపేట, ఇసుకల పాలెం అంగన్‌వాడీ భవన నిర్మాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో నిలిచిపోయాయి. భవనాలు పూర్తికాక పోవడంతో వినియోగంలోకి రాకపోవ డంతో ఆయా గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలతోపాటు ఇసకలపాలెం శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ భవనాలు తుది దశలో వదిలివేశారు. ఇసుకలపాలెం శ్మశాన వాటిక పనులు కూడా అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైసీపీ హయాంలో ఈ పనులపై దృష్టిసారించలేదు. దీంతో ఇసుకలపాలెం శ్మశాన వాటికపరిసర ప్రాంతం ముళ్లపొదలతో నిండిపోయింది. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుచేయించి భవన నిర్మాణాలు పూర్తి చేయిస్తుందని ఆయా గ్రామస్థులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా ఇసుకలపాలెం, సుబ్బపేటలోని అంగన్‌వాడీ కేంద్ర భవనాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన సుబ్బపేట అంగన్‌వాడీ భవనం

నేటి నుంచి పల్లెపండుగ వారోత్సవాలు

పోలాకి: పల్లెపండుగ వారోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. తొలిరోజు పోలాకి మండలం రహిమాన్‌పురం, ఉరజాంలో, 15న జలుమూరు మండలం మర్రివలస, వెంకటాపురం, లింగాలవలసలో, 16న సారవకోట మండలం గొవిందపురం, చిన్నగుజ్జివాడలో, 17న నరసన్నపేట మండలం చిక్కాలవలస,ముసిడిగట్టు, కోమార్తి, 18న పోలాకి మండలంలోని వనితమండలం, చెల్లాయివలస, చీడివలస, 19న కంబకాయ, జమ్ము, 10న సారవకోట కుమర్నిగుంట, జమచక్ర గ్రామాల్లో పర్యటించి పల్లెపండుగ ప్రాధాన్యతను వివరిస్తారని కూటమి నాయకులు తెలిపారు.

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

టెక్కలి: టెక్కలిలో సోమవారం మంత్రి అచ్చెన్నాయుడు పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీమండలాధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పనగర్‌లోని 40 అడుగుల రోడ్డు, మండాపొలం కాలనీలో డ్రెయిన్లు, సీసీ రోడ్లుకు, జిల్లా కేంద్రాసుపత్రిరోడ్డుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

రేపు విగ్రహాల ప్రతిష్ఠ

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినడోకులపాడులో మంగళవారం పాతపట్నం, చండి, మరిడి అమ్మవార్ల ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామాభివృద్ధి సంఘం తెలిపింది. మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ జరుగుతుందని పేర్కొంది.

17న టెక్కలిలో జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. మూడు బహుళజాతి కంపెనీలు నిర్వహించే మేళాలో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకొని 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సుగల వారు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలు, బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫోటోలతో హాజరుకావాలని, వివరాలకు 9182480410కు సంప్రదించాలని కోరారు.

25 నుంచి వడ్డివాడలో కబడ్డీ పోటీలు

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డివాడలో గౌరీ పౌర్ణమి, నందెమ్మ మహోత్సవాలు పురస్కరించుకుని ఈనెల 25 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీజు ఐదువం దల రుపాయలు చెల్లించాలని, ఆసక్తి గల జట్లు 8919172519, 7660802766, 9908879419 నెంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నంలోని ఏకలవ్య ఆదర్శ రెసిడెన్షియల్ స్కూల్‌లో తాత్కాలిక ప్రాతిపదికన 2024-25 విద్యాసంవత్సరానికి పీజీటీ మాథ్స్-1, పీజీటీ ఫిజిక్స్-1 గెస్ట్ టీచర్లగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు. ఒక్కో పోస్టు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19లోగా స్థానిక వైటీసీలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, మెళియాపుట్టిలో లేదా గురుకులం సెల్ ఐటీడీఏ సీతంపేటలో అందజేయాలని తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శ్రీకాంత్

టెక్కలి: టెక్కలి డివిజన్ ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా తాడేల శ్రీకాంత్‌ను నియమిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసిందని డీపీఎం వాన సురేష్ తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన మల్లేశ్వరరావు స్థానంలో శ్రీకాంత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీకాంత్ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ జిల్లా నోడల్ అధికారిగా కొనసాగుతున్నారని తెలిపారు.

హైకోర్టు పీపీకి సన్మానం

సంతబొమ్మాళి: మండలంలోని కృష్ణచంద్రపురంలో హైకోర్టు పీపీ మెండ లక్ష్మీనారాయణను కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు లఖినాన శ్రీనివాసరావు, తిరుమలరావు, వెలమల అప్పలనాయుడు, పల్లి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి: ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని సత్యసేవాసంస్థల సంయుక్తకార్యదర్శి పడాలప్రసాద్ తెలిపారు. ఆదివారం చింతాడపేట స్వామిరామయోగిసేవాశ్రమం వద్ద సత్సంగ సమావేశం నిర్వహించారు. బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.అప్పలనాయుడు, కరుకోల అనంతస్వామి పాల్గొన్నారు.

మద్దిలివానిపేటలో క్విజ్ పోటీలు

నందిగాం: మండలంలోని మద్దిలివానిపేటలో ఆదివారం నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో హూండి గోవిందపురానికి చెందిన వివేకానంద స్కూల్ విజేతగా నిలిచింది. వడ్డివాడకు చెందిన సదాశివ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానాన్ని చిన్నబడాం సాయిశిరీషస్కూల్, తృతీయ స్థానాన్ని టెక్కలి గాయత్రీస్కూల్ సాధించాయి. విజేతలకు స్థానిక ఎఫ్‌సీఐ గొడౌన్ కార్యదర్శి బి.జనార్దనరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కె.మొఖలింగం తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

షిర్డీసాయి మందిరంలో అన్నాభిషేకం

పలాస: పలాసలోని శివాజీనగర్ షిర్డీసాయి సంస్థాన్ మందిరంలో విజయదశమి, షిర్డీ సాయిబాబా మహాసమాధి చెందిన దినం పురస్కరించుకొని శనివారం ఉదయం పది గంటల నుంచి భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు బాబా పాదాలపై అన్నాన్ని వేసి అభిషేకించారు. ఏటా బాబా మందిరంలో అన్నాభిషేకాన్ని విజయదశమి రోజు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా మందిర ఫౌండర్ దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ మందిరం ఏర్పాటు చేసిన నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీంతో పాటు ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి అన్న ఏకనామ సంకీర్తన 24 గంటల పాటు నిర్వహించామని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మందిర ప్రధాన అర్చకులు వాయునందనశర్మ, దువ్వాడ శ్రీకాంత్, ఆర్.శంకర్, దువ్వాడ అన్నాజీరావు, వి.శ్రీనివాస్, సుబ్బిరెడ్డి, దువ్వాడ నవీన్‌చౌదరి, కూన హేమాచలం, డొక్కర రాజారావు పాల్గొన్నారు.

ఏకమాన సంకీర్తన

జంటపట్టణాల్లోని రైల్వేస్టేషన్ రోడ్డు షిర్డీసాయిబాబా ధ్యానమందిరంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ 24 గంటల పాటు ఓంసాయి శ్రీసాయి జయజయసాయి ఏకమాన సంకీర్తన నిర్వహించారు. వారం రోజుల కిందట జంటపట్టణాల్లో పురవీధుల్లో భక్తుల నుంచి సేకరించిన బియ్యంతో మహాసమాధి పురస్కరించుకుని బాబాకు అన్నాభిషేకాన్ని, అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం కాకడా హారతి అనంతరం కార్యక్రమాన్ని ముగించినట్లు మందిర కార్యదర్శి గిన్ని జయశంకర్‌రెడ్డి తెలిపారు.



బాబా విగ్రహం వద్ద అన్నాభిషేకాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



శివాజీనగర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కలగా కొండిరేవు వంతెన

●శిలాఫలకంతోనే నిలిచిన పనులు ●కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సోంపేట: మండలంలోని బారువా, ఉప్పలాం పరిసర ప్రాంత మత్స్యకారులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కొండిరేవు వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. బారువా, బారువా కొత్తూరుతోపాటు టి.శాసనాం, గొల్లవూరు, మూలపాలేం, బట్టిగొల్లూరు, ఉప్పలాం, ఎకువూరు, నడుమూరుతోపాటు మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రజలకు ఉపయోగపడే వంతెన నిర్మాణంపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వంతెన కూటమి ప్రభుత్వం నిర్మిస్తుందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

హామీలు అమలుకాక..

మహేంద్రతనయ నదిపై బారువా సమీపంలో కొండిరేవు వంతెన నిర్మించాలని పరిసర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు దశాబ్దాలుగా కోరుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే ఉప్పలాం, ఎకువూరు, నడుమూరు, బట్టిగొల్లూరు, మూలపాలేం తదితర 20గ్రామాల మత్స్యకారులు బారువ, సోంపేట వెళ్లేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం ఈ మత్స్యకార గ్రామాల ప్రజలు సోంపేట, శాసనాం, పాలవలస కొర్లాం మీదుగా 15 కిలోమీటర్లు ప్రయాణించి చేరుకుంటున్నారు. వంతెన నిర్మిస్తే పది కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మత్స్యకారులు మత్స్యసంపదను సోంపేట పరిసర గ్రామాలకు తరలించేందుకు కొండిరేవు వద్ద నదిని దాటాలి. లేకపోతే చుట్టూ తిరిగి వెళ్లాలి. దీంతో మత్స్యకార మహిళలు నదిలో దిగి బారువ వెళ్తుంటారు. వర్షాకాలంలో ప్రవాహం ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. కొండి రేవు వంతెన నిర్మాణం కోసం దశాబ్దాల కిందట శిలాఫలకం వేసినా పనులు జరగలేదు. వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడంలేదని మత్స్యకారులు వాపోతున్నారు.

వంతెన నిర్మాణం కోసం కృషి

బారువ సమీపంలో కొండిరేవు వద్ద వంతెన నిర్మాణం కోసం తమ ప్రభుత్వ హయాంలో కృషి చేశామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. నిధులు మంజూరు కావల్సిన సమయంలో ఎన్నికలు వచ్చాయని చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన చెప్పారు. కాగా మహేంద్రతనయ నదిపై బారువ వద్ద వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు సంబంధిత శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. పీఎంజీఎస్‌వై కింద నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



బారువ వద్ద కొండిరేవు వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

వినతిపత్రాలు అందించాం



మహేంద్ర తనయ నదిపై బారువ వద్ద వంతెన నిర్మిస్తే చుట్టుపక్కల మత్స్యకారులకు మేలు జరుగుతుంది. మత్స్యకారులు అధికారులకు, నాయకులకు ఎన్నో సార్లు వినతిపత్రాలు అందించాం. కానీ పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా స్పందించి కొండిరేవు వంతెన నిర్మించాలి

- వాసుపల్లి కృష్ణారావు, మత్స్యకారుడు, ఎకువూరు

అమ్మో.. ముంగెన్నపాడు రోడ్డు

● రాళ్లు తేలడంతో రాకపోకలకు అవస్థలు



రాళ్లుతేలిన ముంగెన్నపాడు రోడ్డు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రధానంగా రాళ్ల తేలడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో అగచాట్లకు గురవుతున్నామని సర్పంచ్ వై.గణపతితోపాటు ఎం.జగదీశ్వరరావు, వై.రాంబాబు, మల్లేశ్వరరావు తదితరులు వాపోతున్నారు. మూడేళ్లుగా రోడ్డు పాడైనా ప్రజాప్రతినిధులు,అధికారులు మరమ్మతుకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ముంగెన్నపాడు పరిధిలో అలికాం- బత్తిలి ప్రధాన రోడ్డుకు అనుసరించి రెండు కిలోమీటర్లమేర పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో చీకటి పడిన తర్వాత అత్యవసర సమయాల్లో ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రాణాలు చేతిలో పెట్టుకొని వెళ్లాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. మతలబుపేట, చిన్న మతలబుపేట, సిద్దాంతం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇదే మార్గంలో పాఠశాలలకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీఐ కమిషన్ పనితీరు ప్రక్షాళన చేయాలి

టెక్కలి: ఆర్టీఐ కమిషన్ కార్యాలయంలో కమిషన్ పనితీరును పరిశీలించి ప్రక్షాళన చేయాలని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనపాన షణ్ముఖరావు, ఉప్పాడ సూర్యనారాయణ కోరారు. ఆదివారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ బాలారిష్టాలమధ్య సమాచార హక్కు చట్టం కొట్టుమిట్టాడుతోందన్నారు. చట్టం అమలులోకి వచ్చి 19ఏళ్లు గడిచిందని, ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం, అధికారుల అలసత్వం శాపంగా మారిందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్టీఐ అమలుకు ప్రభుత్వాలు తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో కమిషనర్లకు పునరావాస కేంద్రాలుగా కమిషన్ కార్యాలయాలు మారాయన్నారు. నిర్దిష్ట సమయంలో సమాచారం ఇవ్వని పౌరసమాచార అధికారులు మొదటి అప్పిలేట్ అథారిటీపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని కోరారు.

'టెట్'కు 62 మంది గైర్హాజరు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీ పరీక్ష కేంద్రంలో జరుగుతున్న టెట్ పరీక్షకు ఆదివారం 62 మంది అభ్యర్థులు గైర్హాజయ్యారు. 660 మంది అభ్యర్థులకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు కేటాయించగా ఉదయం షిఫ్టులో 295 మంది, మధ్యాహ్నం 303 మంది మొత్తం 598 మంది పరీక్షలు రాసినట్లు పర్యవేక్షకులు, ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. ఈనెల 21 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

'కుప్పిలి'కి జాతీయ ప్రశంసాపత్రం

ఆమదాలవలస: పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు రచించిన డార్క్‌సీన్ కవిత జాతీయస్థాయిలో ఎంపికయ్యింది. ఈమేరకు ఎస్7 గూగుల్ సంస్థ జాతీయ స్థాయిలో సెప్టెంబరులో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంగ్లీష్ కవితల పోటీల్లో వెంకట రాజారావుకు ప్రశంసాపత్రం లభించింది.

కేజీబీవీల్లో సిబ్బంది భర్తీకి చర్యలు

●జిల్లాకు 38 పోస్టులు కేటాయించిన ప్రభుత్వం

ఇచ్ఛాపురం: కేజీబీవీల్లో సిబ్బందిభర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విద్యాలయాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. కొద్దేళ్లుగా కేజీబీవీల్లో నూతన నియామకాలు లేవు. ఈనేపథ్యంలో జిల్లాలోని కేజీబీవీలకు 38 పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. డ్రాపౌట్స్ నియంత్రణతోపాటు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు వీటిని ఏర్పాటుచేశారు. ప్రారంభంలో పకడ్బందీగా సేవలందించినా, తర్వాత కాలంలో పభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అడ్మిషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పాఠశాలలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసినా అధ్యాపకుల ను నియమించలేదు. తాజాగా పార్ట్ టైం టీచర్లతో పాటు మిగతా ఖాళీలను భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

తల్లిదండ్రులు చనిపోయినా, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసపోయిన వారి పిల్లలకు వసతితో కూడిన విద్యనందించేందుకు 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పాఠశాలలను ప్రారంభించాయి. తొలుత ఆరు నుంచి పదో తరగతి వరకూ ఈ పాఠశాలలు నిర్వహించేవారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇంటర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్‌చేశారు. సంప్రదాయ కోర్సులతో పాటు ప్రత్యేక సాంకేతిక కోర్సులను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, కంప్యూటర్, టాలీ వంటి వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టారు. కేజీబీవీల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయినులు (సీఆర్టీలు)ను నియమించారు. నిరంతర వైద్యసేవల కోసం ఏఎన్ఎం సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.అయితే మధ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు రావడం, వివిధకారణాలతో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కాలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సైతం వీటిని నియమించలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కదలిక వచ్చింది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో ఉన్న 38 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. పీజీటీలు 3, సీఆర్టీలు 13, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ 16, వార్డెన్ పోస్టులు 3, అకౌంటెంట్ పోస్టులు 3ను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులు భర్తీ అయితే కొంతవరకూ సిబ్బంది కొరత తీరే అవకాశముంది.

శ్రీముఖలింగంలో శమీపూజ



శ్రీముఖలింగంలో జమ్మిచెట్టు వద్ద శమీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో కొలువుదీరిన వారాహి అమ్మవారి సన్నిధిలో విజయదశమి పర్వదినం పురస్కరించుకొని శనివారం రాత్రి శమీ పూజ (జమ్మి చెట్టుకు) నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి మహారాజు పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. సాయంత్రం వారాహి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించి భవానీ స్వాములు దీక్షలు విరమించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తెచ్చి నూతన వస్త్రాలు ధరించి పూలమాలలుతో అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేశారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, యోగి, అచ్యుత పాల్గొన్నారు. కాగా శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామికి ఆదివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

అబ్బాయిపేటలో లక్షార్చన తులసి పూజ

జలుమూరు మండలంలోని అబ్బాయిపేటలో గల శ్రీమురళీకృష్ణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం లక్షార్చన తులసిపూజ నిర్వహించారు. ఆశ్వీయుజమాసం శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని అర్చకులు దివాకర్ నేతృత్వంలో లక్షార్చన తులసిపూజ చేపట్టారు. ముందుగా స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో అబ్బాయిపేటతో పాటు, గంగాదరపేట, కెఎల్ఎన్ పేట, ఊడిగలపాడు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న న్యాయాధికారి

మెళియాపుట్టి: స్థానిక వేణుగోపాలస్వామిని జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి మహేంద్రకుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు గోపినాథ్ ఆహ్వానం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన వెంట ఎస్ఐ రమేష్‌బాబు ఉన్నారు.

ఘనంగా అసిరితల్లి ఉత్సవాలు



ముర్రాటలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేటలో ఆదివారం అసిరితల్లి గ్రామ దేవత ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో మొక్కులు చెల్లించారు. ఏటా ఆశ్వయుజ మాసంలోని పౌర్ణమి ముందు గ్రామస్థులు అసిరితల్లికి ముర్రాటలతో మొక్కులుచెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. అలాచేస్తే పంటలు బాగా పండి గ్రామంలో ప్రశాంతత నెలకొంటుందని పలువురి పెద్దలు తెలిపారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు

టెక్కలి: టెక్కలి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వెంకటేశ్వర గీతా భక్త మండలి నిర్వాహకులు విజయదశమిని పురస్కరించుకొని బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. బొమ్మల కొలువును పట్టణ ప్రజలు పెద్దఎత్తున తిలకించారు. ఆలయ ప్రాంగణంలో సందడినెలకొంది.

నిరుపయోగంగా జనరేటర్లు



పాత రెవెన్యూ కార్యాలయం వద్ద తుప్పుపట్టిపోతున్న జనరేటర్

గార: గారలోని పాత రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఎనిమిది సంవత్సరాల కిందట ఫైబర్ నెట్, ఆఫీస్ నిర్వహణ కోసం కొనుగోలుచేసిన రెండు పవర్ జనరేటర్లు నిరుపయోగంగా మారాయి. వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోయి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలుచేసిన జనరేటర్లు రెవెన్యూ కార్యాలయంలో ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయి. ఇక్కడి నుంచి రెవెన్యూ కార్యాలయం ఏడాది కిందట కొత్త భవనంలోకి తరలించిన విషయం విదితమే. అయితే జనరేటర్లను పాత భవనం ఆవరణలోనే విడిచిపెట్టారు. తక్షణమే ఈ జనరేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించండి

పోలాకి: గంగివలసలో గ్రామదేవత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పోలాకి ఎస్ఐ రంజిత్ కోరారు. ఆదివారం గ్రామస్థులు,ఉత్సవకమిటీ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామదత్తత పోలీస్ శంకర్,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో యువకుడి ఆత్మహత్య

- గంటపాటు నిలిచిపోయిన కామాఖ్య సూపర్‌ఫాస్ట్ రైలు

పలాస: పలాస రైల్వే స్టేషన్ మూడో నెంబరు ప్లాట్‌ఫారంపై ఆదివారం ఉదయం గుర్తుతెలియని యువకుడు(30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కామాఖ్య సూపర్‌ఫాస్ట్ రైలు ప్లాట్‌ఫారంపై గంటపాటు నిలిచిపోయింది. మృతదేహాన్ని తరలించిన అనంతరం రైలును యదాతధంగా పంపించారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సోమవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో కామాఖ్య రైలు పలాస మీదుగా భువనేశ్వర్ వైపు వెళ్తోంది. ప్లాట్‌ఫారంపై నుంచి గుర్తుతెలియని యువకుడు ఒక్కసారిగా రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్లాట్‌ఫారంపై రైలు వేగాన్ని నియంత్రించి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చూసిన డ్రైవరు రైలును నిలిపివేశాడు. అప్పటికే ఆ యువకుడి శరీరం నుజునుజ్జయింది. గస్తీలో ఉన్న రైల్వేపోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రైలును వెనక్కు మళ్లించారు. అప్పటికే ఆ యువకుడు మృతి చెందాడు. అంతకు ముందు ఆ యువకుడు ఫలక్‌నుమా రైలులో వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. తాను మరణిస్తానని, తనను ఆపకండని తోటి ప్రయాణికులకు చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో అదే రైలుకింద పడి ఆత్మహత్యకు యత్నించి తీవ్ర గాయపడ్డాడు. ఆయన్ను ఆసుపత్రికి తరలించడానికి సిద్ధమవుతున్న తరుణంలో కామాఖ్య రైలుకిందకి దూకి ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరం. హెచ్‌సీ సోమేష్‌కుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. కోల్‌కతా ప్రాంతానికి చెందినవాడిగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సి తెలిపారు.

పెళ్లింట విషాదం

- వారం రోజుల్లో కుమార్తె పెళ్లి
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- కుటుంబసభ్యుల రోదన


మోహనరావు (ఫైల్)

టెక్కలి: పెళ్లింట విషాదం నెలకొంది. వారం రోజుల్లో కుమార్తె పెళ్లి జరగనుండగా.. కార్డులు ఇవ్వడానికి వెళ్లి తిరిగి వస్తుండగా కుమార్తె తండ్రిని లారీ రూపం మృత్యువు కబలించింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని అక్కవరం పంచాయతీ శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన రుంకు మోహనరావు కుమార్తె హిమావతికి ఈనెల 20న వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో బంధువులు, స్నేహితులకు కబుర్లు చెప్పేందుకు కుటుంబ సభ్యులు తలమునకలయ్యారు. ఇందులో భాగంగా ఆదివారం తండ్రి మోహనరావు పెళ్లికార్డులు ఇచ్చేందుకు విక్రాంపురం సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో జాతీయ రహదారిపై విక్రాంపురం వద్ద శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో కిందపడిపోయాడు. అయితే మోహనరావుకు చిన్నపాటి గాయాలయ్యాయని, లారీ డ్రైవర్ కొంతసేపు ఆపాడు. తరువాత లారీ పలాస వైపు వెళ్లిపోయింది. ఈలోగా స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి మోహనరావును తరలించగా చికిత్స పొందుతూ మోహనరావు మృతిచెందాడు. ఆయనకు భార్య మాలతి, కుమారుడు చరణ్, కుమార్తె ఉన్నారు. మరో వారం రోజుల్లో జరిగే పెళ్లి ఇంట విషాదం జరగడంతో ఆ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

మద్యం బాటిల్ పగిలి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సురేష్ (ఫైల్)

మెళియాపుట్టి: మురికిభద్ర గ్రామానికి చెందిన సవర సురేష్ (26) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృ తి చెందినట్లు ఎస్ఐ పి.రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్రవాహనంపై వస్తున్న సురేష్ అదుపుత ప్పి పడిపోవడంతో కడుపులో దాచుకున్న మద్యం బాటిల్ పగిలిపోయింది. దీంతో కడుపులోకి బాటిల్ గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం పాతప ట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

- మనస్తాపంతో భార్య ఆత్మహత్యాయత్నం
- కేశవరాయునిపాలెంలో విషాదం


చంటి(ఫైల్)

లావేరు: రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం చెందగా.. దీన్ని తట్టుకోలేక అతడి భార్య పురుగుల మందు తాగింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన నాయిన చంటి (26) శనివారం తన గ్రామం నుంచి బైక్‌పై మురపాక వస్తుండగా.. హనుమయ్యపేట వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో చంటి అక్కడిక్కడే మృతి చెందాడు. భర్త మరణాన్ని తట్టుకోలేక అతడి భార్య భవానీ ఆదివారం పురుగులు మందు తాగి ఆత్మహత్యహత్యాయత్నానికి పాల్పడింది. ఈమె కూడా ప్రస్తుతం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. చంటి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరి వివాహం జరిగి ఏడాది కూడా కాలేదు. వీరిద్దరూ ఎంతో అన్యోన్యంగా గడుపుతుండగా విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో చంటి మృతి చెందడం అందర్ని కలచివేస్తోంది. దసరా రోజున ఇటువంటి ఘటన జరగడంతో కేశవరాయునిపాలెం గ్రామంలో విషాదం నెలకొంది. చంటి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


అరుణ(ఫైల్)

కంచిలి: అంపురం పంచాయతీ పద్మతుల గ్రామానికి చెందిన పులి అరుణ కుమారి(27) కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ఒంటిపై డీజిల్ పోసుకుని, నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు సోంపేట సీఐ మంగరాజు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరుణకుమారికి భర్త లక్ష్మీనారాయణకు మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. లక్ష్మీనారాయణ ఇచ్ఛాపురం బోర్డర్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. మద్యానికి బానిసై ప్రతీరోజు భార్యతో గొడవలు పడుతుండేవాడు. తాగి రావడమే కాకుండా కొట్టడం, పుట్టింటికి వెళ్లిపోమనడం చేస్తుండేవాడు. శనివారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి, కొట్టడడం కన్నవారింటికి వెళ్లిపోమన్నాడు. దీంతో మనస్తాపానికి గురై రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఉన్న డీజల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం ఎంకేసీజీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈమెకు భర్త లక్ష్మీనారాయణ తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై సోంపేట సీఐ బి.మంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంకేసీజీలో పంచనామా నిర్వహించిన తర్వాత తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

చెరువులో జారిపడి బాలుడి మృతి


త్రినాథ్ (ఫైల్)

కంచిలి: కొత్త అంపురం గ్రామానికి చెందిన మద్ది త్రినాథ్(12) అనే బాలుడు శనివారం ఉదయం ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని చెరువులో జారిపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్ది నీలయ్య కుమారుడు త్రినాథ్ దసరా సందర్భంగా తన సైకిల్‌ను కడిగేందుకు శనివారం ఉదయం పక్కనే ఉన్న చెరువుకు వెళ్లాడు. సైకిల్‌ను గట్టుపై ఉంచి బకెట్‌తో నీరు తెచ్చి, సైకిల్‌ను కడుగుతున్నాడు. ఈ క్రమంలో చెరువులో జారిపడి మునిగిపోయాడు. అక్కడే ఉన్న కొంతమంది పిల్లలు కేకలు వేయడంతో గ్రామస్థులు వెంటనే చెరువులో దిగి త్రినాథ్‌ను కాపాడేందుకు ప్రయత్నించారు. నీటిలో మునిగిపోయిన బాలుడిని ఒడ్డుకు తెచ్చేసరికి అపస్మారక స్థితిలోకి చేరాడు. వెంటనే సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి, అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. పండుగంటి రోజున త్రినాథ్ అకాల మరణంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై బాలుడి తండ్రి నీలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రామచంద్రారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన శరన్నవరాత్రులు


జి.సిగడాం: పెంట గ్రామంలో అమ్మవారి అనుపోత్సవాల్లో వేషధారణలతో..

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు గత రెండు రోజులుగా అనుపోత్సవాలు చేపట్టారు. ప్రత్యేక పూజలు చేసి, కోలాటం, తీన్‌మార్ డ్యాన్స్‌లు, డీజేల నడుమ తిరువీధి సందడిగా నిర్వహించారు.
- ఆంధ్రజ్యోతి బృందం


కోటబొమ్మాళి: నిమ్మాడలో దసరా పూజల్లో మంత్రి అచ్చెన్న, కుటుంబ సభ్యులు


ఆమదాలవలస: దుర్గమ్మను దర్శించుకుంటున్నఎమ్మెల్యే రవికుమార్


పాతపట్నం: అమ్మవారి తిరువీధిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నరసన్న పేట: మాకివలసలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి ఆలయంలో పసుపుకొమ్ములతో మహాలక్ష్మి దేవికి, జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం


పొందూరు: రైల్వేస్టేషన్‌లో నవరాత్రి మండపంలో..


పోలాకి: కోలాట ప్రదర్శన


టెక్కలి: అమ్మవారి నిమజ్జనానికి ఊరేగింపుగా..


నందిగాం: నీలమణిదుర్గ ఆలయంలో..


పాతపట్నం: నీలమణి దుర్గమ్మ తిరువీధిలో కోలాట ప్రదర్శన


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాలకు పూజల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆశ్వీజ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ అనివెట్టి మండపంలో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం జరిగిందని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, సాంబమూర్తి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.2,90,391 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల రూపేణా రూ.85,300, విరాళాల ద్వారా రూ.47,296, ప్రసాదాల రూపంలో రూ.1,57,795 లభించినట్టు ఈవో స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ


పతకాలతో విజేత


శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాకు చెందిన ఇద్దరు వెయిట్ లిఫ్టర్లు హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. మహిళలు 64 కిలోల విభాగంలో జి.హర్షిత (ఆడవరం) స్నాచుల్లో 81 కిలోలు, క్లీనెంట్ జర్క్‌లో 100 కిలోల మొత్తం 181 కిలోల బరువు ను ఎత్తి యూత్‌లో గోల్డ్‌మెడల్‌ను, జూనియర్‌లో బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో ముద్దాడ తరుణ్ (పెద్దపాడు) 81 కిలోల యూత్‌లో, స్నాచుల్లో 125 కిలోలు, క్లీనెంట్ జర్క్‌లో 160 కిలోలు మొత్తం 185 కిలోల బరువును ఎత్తి సిల్వర్ పతకాన్ని కైవసం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు, ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఇంజరాపు భాస్కరరావు, కోచ్ ఈపల్లి అప్పన్న తదితరులు వీరిని అభినందించారు.

నగదు ప్రోత్సాహకాలు అందజేత


నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

సోంపేట: గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు పైబడి సాధించిన 24 మంది శ్రీశయన విద్యార్థులకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలను శ్రీశయన చైతన్య దీపిక సభ్యులు అందజేశారు. స్థానిక రోటరీ క్లబ్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలోని 24 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికీ రూ.మూడు వేలు అందించారు. అలాగే రోటరీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఇచ్చిన వాటర్ బోటల్స్‌తోపాటు మొక్కలు అందజేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు దేవాడ మోహనరావు, వీర్రాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బీన ఆనందరావు, బీన ఈశ్వరరావు, బల్ల జానకిరావు, పొడుగు కామేష్, బంజు లోకనాధం, బల్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల విజేత లండారిపుట్టుగ


ట్రోఫీలతో విజేత జట్టు

ఇచ్ఛాపురం: బూర్జుపాడులో సరస్వతి పూజ పంచరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో కవిటి మండలం అండారిపుట్టుగ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు ద్వితీయ బహుమతి, టెక్కలి మండలం పూండి జట్టు తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు బహుమతులు అందజేశారు. క్విజ్‌మాస్టర్‌గా శమల్ల రాజబాబు, బాలక శ్రీనివాస్, నీలాచలం, భూషణం, వ్యవహరించారు. అలాగే తేలుకుంచి గ్రామంలో ఆదివారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల నుంచి జట్లు పాల్గొనగా ఇచ్ఛాపురం విద్యార్థులు క్విజ్ విజేతగా నిలిచారు. సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శంభాన మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ

కంచిలి: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యాక్షుడు శంభాన రామారావు మృతి పార్టీకి, దళిత వర్గానికి తీరని లోటని జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గొల్లకంచిలి గ్రామానికి చెందిన శంభాన రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం గ్రామంలో నిర్వహించిన రామారావు సంస్మరణ సభకు మంద కృష్ణ మాదిగ హాజరై, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మున్నింగి నాగరాజు, సుబ్బయ్య మాదిగ, నత్తల కృష్ణ మాదిగ, రాణా శ్రీనివాస్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

టీడీపీలో చేరిన 20 కుటుంబాలు


పార్టీలో చేరిన వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: బి.గొనగపుట్టుగ గ్రామానికి చెందిన గొనప సంతోష్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. రామయ్యపుట్టుగలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు

గ్రామీణ క్రీడలను ఆదరించాలి

అరసవల్లి: గ్రామీణ క్రీడలైన కర్రసాము, తాళింఖానాలను ఆదరించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. శివ తాలింఖానా వ్యాయామశాల స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా శనివారం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్రసాము, తాళింఖానా ఆత్మరక్షణ విద్యగా ఉపయోగపడుతుందని, ఈ క్రీడలు మన గ్రామీణ క్రీడా సంపదకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. మన పూర్వీకులు ఏ ఉత్సవం, ఊరేగింపు నిర్వహించినా ఈ క్రీడలను తప్పక ప్రదర్శించేవారని గుర్తు చేశారు. నేడు ఈ క్రీడలు కనుమరుగవుతున్నాయని, వీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా కర్రసాము, కత్తిసాము ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. కార్యక్రమంలో శివ తాలింఖానా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటమే తప్పా ఆచరణ లేదు

గార: వంద రోజుల్లో ఏదో చేసేశామని చెబుతున్న ఈ కూటమి ప్రభుత్వంలో ఆర్భాటమే తప్పా ఆచరణ ఏమిలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం ఉదయం గారలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ మార్పు ధర్మారావు స్వగృహంలో విలేకరుతో మాట్లాడుతూ.. మాట తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటే అని అన్నారు. కౌంటింగ్ రోజు నుంచే దాడులు ప్రారంభించి కొనసాగిస్తున్నా రన్నారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైసీపీ నాయకులు మార్పు ధర్మారావు, సర్పంచ్ పృథ్వీరాజ్, మార్పు మన్మధరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగు తుంది. ఆదివారం రెండు షిఫ్టుల్లో కలిపి శివానీ ఇంజనీ రింగ్ కళాశాల (చిలకపాలెం)లో 340కు 309 మంది హాజ రయ్యారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 101కు 93 మంది హాజరయ్యారు. ఈ నెల 3న ప్రారంభమైన టెట్ 21వ తేదీతో ముగుస్తుంది.

నిప్పుల గుండం తొక్కిన భక్తులు

ఇచ్ఛాపురం: గాయత్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి పురస్కరించుకొని శనివారం రాత్రి గాయత్రి దేవి గురుస్వామి వాసుదేవ్ ఆధ్వర్యంలో గాయత్రీదేవి దీక్ష తీసుకున్న భక్తులు నిప్పుల గుండంలో నడిచారు. వీరితో పాటు భక్తులు కూడా నడిచి తమ భక్తిని చాటుకున్నారు.

నిప్పుల గుండం తొక్కుతున్న భవానీ భక్తుడు →



రూరల్ ఎస్ఐగా రాము

శ్రీకాకుళం క్రైం: విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు ఎస్ఐలకు ఆదివారం బదిలీ అయింది. ఈ మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న కిషోర్ వర్మ స్థానంలో ఏఎస్ఆర్ జిల్లా డీఎస్‌బీలో ఎస్ఐగా పని చేస్తున్న కరక రామును నియమిస్తూ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశాలు జారీ చేశారు. అలాగే టెక్కలి అర్బన్ ఎస్ఐగా పనిచేసిన కిషోర్ వర్మను చింతపల్లి స్టేషన్‌కు బదిలీ చేశారు.

'నా కూతుర్ని అత్తింటివారే చంపేశారు'

సంతబొమ్మాళి: నా కుమార్తె రేవతి (19)ని అత్తవారింటి వారు హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించారని తెనుగుపెంటకు గ్రామానికి చెందిన ఆమె తల్లి చంద్రింకి రాజేశ్వరి ఆరోపించింది. ఆమె తెలిపిన వివరాల మేరకు.. తన కుమార్తె రేవతిని అదే గ్రామానికి చెందిన పెంట లక్ష్మయ్యతో ఏడాది కిందట వివాహం జరిగింది. ఈ పెళ్లి కోసం రూ.20 లక్షల వరకు ఖర్చు చేశామని, అప్పులు తీర్చడానికి తన భర్త సింహాచలంతో కలిసి నెల్లూరు వలస వెళ్లిపోయారు. ఈ నెల 4న అర్ధరాత్రి నుంచి రేవతి కనిపించడం లేదని ఆమె అత్తవారింటి నుంచి ఫోన్ చేశారు. దీంతో హుటాహుటిన భర్తతో కలిసి స్వగ్రామానికి చేరుకున్నారు. ఇంతలోనే తన కుమార్తె గ్రామ నడిబొడ్డున ఉన్న తాగునీటి బావిలో శవమైతేలింది. తన కుమార్తెను అత్తింటివారే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, నిజానిజాలు తేల్చాలని పోలీసులు కోరారు. దీనిపై సంతబొమ్మాళి ఇన్‌చార్జి ఎస్ఐ నారాయణస్వామిని వివరణ కోరగా.. రేవతి మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వస్తే నిజానిజాలు తేలుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కంచిలి: పెద్దకొజ్జిరియ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మఖరాంపురం గ్రామానికి చెందిన త్యాగరాజు, కవిత దంపతులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. జాడుపుడి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా పెద్ద కొజ్జిరియా వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు వీరిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ గాయాలు కావడంతో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం టెక్కలి ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలు అవసరం

గార: ప్రథమ చికిత్సా కేంద్రాలు అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలు పంచాయతీ పిలకవానిపేటలో శ్రీకృష్ణ మహిమాన్విత ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రథమ చికిత్స కేంద్రాలు ఎంతో సహాయం చేస్తాయన్నారు. స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం స్థానిక రాజ రాజేశ్వరి పీఠంలో శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యబృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. 35 మంది కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి అక్కడివారిని మంత్రముగ్ధులను చేశారు. పీఠం వ్యవస్థాపకులు లక్ష్మీగణపతి శర్మ, శ్రీకాంత్‌లను ఘనంగా సత్కరించారు.

- **సరుబుజ్జిలి:** పురుషోత్తపురం గ్రామంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచాయతీ స్థాయిలో శనివారం సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. భరతనాట్యం విభాగం నుంచి గ్రామానికి చెందిన రేజేటి సాయి మహిమశ్రీ ప్రతిభ చూపారు. ఈమె తాత బంకుపల్లి వెంకట సత్యగోపాలశర్మ, రాష్ట్ర స్థాయి పౌరాణిక ప్రదర్శనలకు అవార్డులు, బిరుదులు పొందారు. అలాగే ఆలయ ఆవరణలో అమ్మవారి తొమ్మిది అవతారాలకు ధరించిన చీరలను కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.